www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025

5

తిరుపతి



అనుమతుల్లేని నిర్మాణం తొలగింపు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధి, బైరాగి పట్టేడులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్థు నిర్మాణాన్ని, ఎన్.జి.వో. కాలనీలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని గురువారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్థు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఆదేశాల మేరకు పరిశీలించి, తొలగించామని తెలిపారు. అలాగే శిథిలావస్థలో ఉన్న భవనాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, టిపిబిఓ సంతోష్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రహ 'దారి'ద్ర్యం



బంగారమ్మ గుడి వద్ద రోడ్డు దుస్థితి

కొత్త కండ్రిగ వద్ద రోడ్డు పరిస్థితి

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- రాళ్లు తేలిన దారులు
- నోళ్లు తెరిచిన గుంతలు
- ప్యాచీలతో సరిపెడుతున్న అధికారులు
- జేబులు నింపుకుంటున్న కాంట్రాక్టర్లు
- కూటమి పాలనపై విమర్శలు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : తామొస్తే రహదారులను అద్దాల్లా మారుస్తామని బీరాలు పలికింది కూటమి ప్రభుత్వం. ఎక్కడా గుంతలు, అతుకుల్లేని రాచమార్గాలుగా తీర్చిదిద్దేందుకు రహదారి ఉద్యమాన్ని చేపడుతామని ప్రకటించింది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియా వేదికగా రోడ్ల దుస్థితిపై యుద్ధం చేశారు కూటమి నేతలు. అయితే చెప్పేది ఒకటైతే.. చేసేది మరోటంటూ గత ప్రభుత్వ రహదారిద్ర్యమే తమదీనంటూ నిరూపించుకుంటోంది చంద్రబాబు సర్కార్. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో రహదారులకు మరింత ధుర్గతి పట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో రహదారులు వాహనదారులకు నరకం చూపిస్తుండటమే ఇందుకు ఉదాహరణ. 'గోరు చుట్టుపై.. రోకలి పోటు' అన్న చందంగా అసలే.. గుంతలు రోడ్లు.. వాటికి తోడు మొంథా తుపాను కారణంగా రహ దారుల పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యాయి.

నోళ్లు తెరిచిన గుంతలు

పల్లెలతో పాటు శ్రీకాళహస్తి పట్టణంలో సైతం రహదారులు గుంతలమయమయ్యాయి. తారు, సిమెంటు పోయి వాహనదారుల ఒళ్లు హూనం చేస్తున్నాయి. తీరూ తెన్నూ లేని రోడ్ల మీద ప్రయాణంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా అధికార యంత్రాంగం వాటిని బాగు చేయక పోవడం ప్రజలకు నిత్యం నరకం చూపిస్తోంది. శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరుకు వెళ్లే ప్రధాన ఆర్అండ్ బీ రోడ్డు దుస్థితిని చెప్పనలివి కాదు. ధర్మరాజుల గుడి, బంగారమ్మ గుడి, నాగాలమ్మ గుడి వద్ద రోడ్డులో మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి. కాళంగి రోడ్డు పరిస్థితీ ఇంతే. అదేవిధంగా శ్రీకాళహస్తి-ముచ్చివోలు, శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డు, ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారి, శ్రీకాళహస్తి-తొండమనాడు, వేడం, రామాపురం, శ్రీకాళహస్తి పట్టణంలోని పలు అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో దెబ్బతిని గుంతలు నోర్లు తెరిచిన పరిస్థితి కనబడుతోంది. భారీ వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.

ప్యాచీలతో సరి!

శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 100 కిలోమీటర్ల మేర రహదారులు విస్తరించి ఉన్నాయి. అయితే దెబ్బతిన్న రోడ్లకు శాశ్వత మరమ్మత్తులు చేపట్టడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వర్షాలు పడ్డ ప్రతిసారీ రహదారులు మరింత దుస్థితికి చేరుకుంటున్నాయి. గుంతలకు ప్యాచీలు వేయడం.. మళ్ళీ వర్షాలు రావడం గుంతలు ఏర్పడటం షరా మామూలైపోతోంది. ప్యాచీలు వేసే కాంట్రాక్టర్ ఏటా జేబులు నింపుకోవడం తప్ప రహదారుల పరిస్థితి బాగుపడింది లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పటిష్టమైన మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

> **యుద్ధ ప్రాతిపదికన చర్యలు**
> **: రాంబాబు, ఆర్ అండ్ బీ డీఈ, శ్రీకాళహస్తి**
> మొంథా తుపాను కారణంగా చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్న మాట వాస్తవమే. యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేసేందుకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం డస్ట్ వేసి గుంతలు పూడ్చుతాం. వర్షాలు తగ్గుముఖం పట్టాక డిసెంబర్లో ప్యాచీ వర్క్ ప్రారంభమవుతుంది.

తిరుమలలో వైభవంగా పుష్పయాగం



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు గురువారం తిరుమలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తెలియక ఏమైనా దోషాలు జరిగిఉంటే, ఆ దోష నివారణకు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉదయం శ్రీ మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనం జరిగిందని చెప్పారు. మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయమానంగా పుష్పయాగం నిర్వహించినట్లు తెలిపారు. 5 టన్నుల పుష్పాలను వివిధ రాష్ట్రాలనుంచి తెప్పించినట్లు తెలిపారు.

ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్కు సన్మానం



శ్రీవారి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించేందుకు దాతల నుంచి పుష్పాలు సేకరించేందుకు కృషి చేసిన టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులును ఆలయ అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు చేపట్టండి



వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశంలో కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని విభాగ అధికారులు, ఆన్లైన్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో డ్రైనేజి కాలువలు, రోడ్లు పాడయ్యాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త కుప్పలు, బురద తొలగించి బ్లీచింగ్ వేయాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై వేగ నియంత్రణ చర్యలు చేపట్టండి.. నగరంలోని గరుడవారధిపై వేగ నియంత్రణకు మరిన్ని అదనపు చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గరుడవారధి పై వాహనాల వేగ నియంత్రణ కొరకు స్మార్ట్ సిటీ, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గరుడవారధి పై ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పాట్లు చేసామని తెలిపారు. వాహన చోదకుల్లో మరింత అవగాహన కలిగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా వేగాన్ని నియంత్రించే రబ్బర్ స్ట్రిప్స్, మలుపు తెలుపుతూ సూచిక బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గరుడవారధి పైన, కింద ట్రాఫిక్ నియంత్రణ కొరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రవిమనోహర్ ఆచారి, డి.ఎస్.పిలు రామకృష్ణ ఆచారి, భక్తవత్సలం, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘ నాయకులపై పోలీసుల దౌర్జన్యం



సీఐ బాబికి వినతి పత్రం

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రజలు పడుతున్న బాధలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రయత్నించిన ప్రజా సంఘ నాయకులపై నాయుడుపేట పోలీసులు చేసిన దౌర్జన్యం దుర్మార్గమని సిఐటియు నాయకులు శివకవి ముకుంద మండిపడ్డారు. నాయుడుపేట ట్రెజరీ రోడ్డు కారణంగా ప్రజలు పడుతున్న బాధలపై గురువారం ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై సిఐటియు నాయకులు హర్షం తెలియజేస్తూ ఈ రోడ్డు కారణంగా ప్రజలు పడుతున్న బాధలు ప్రభుత్వానికి తెలిపేందుకు చేపట్టబోయిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్లోని పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాల కారణంగా సంవత్సరాలుగా గుంతలు నిండి ఉన్న రోడ్డు బాగు చేయాలని నిరసన తెలియజేయడానికి వచ్చిన నాయకులపై దౌర్జన్యంగా అరెస్టులకు పాల్పడడం ప్రజలపై సమాజంపై చులకన భావాన్ని తెలియజేస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ అన్నారు. సిఐటియు మండల నాయకులు శివకవి ముకుంద, అబ్దుల్లా మాట్లాడుతూ మేనకూరు సెజ్ సంబంధించి అతి భారీ వాహనాలు నిరంతరం రద్దీగా ఈ రోడ్డు మీద తిరగడంతో రోడ్డు పగిలి గుల్ల గుల్లగా మారి కొద్దిపాటి వర్షానికే జలమయమవుతుందని ఈ రోడ్డు మరమ్మత్తులకై మున్సిపాలిటీ 10 లక్షల రూపాయలతో రోడ్డును బాగు చేసేందుకు కాంట్రాక్టర్కి అప్పజెప్పడంతో ఆ కాంట్రాక్టర్ పాత ఎమ్మార్వో ఆఫీస్ పగలగొట్టిన మట్టి తోలి 10 లక్షలు రూపాయల ప్రజాధనాన్ని అధికారుల సహకారంతో అప్పణంగా మింగేసారని, పైగా ఈ మట్టి కారణంగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు సభ్యులు ఆ సమస్యపై నిరసన కార్యక్రమం చేపట్టే తరుణంలో నాయుడుపేట సీఐ, ఎస్ఐ పోలీసులతో సిఐటియు నాయకులను నిరసన చేయనీయకుండా అడ్డుకొని అరెస్టు చేశారని ప్రజారక్షణకై నియమించబడ్డ పోలీసులు రాజకీయ నాయకుల అవినీతికి అండగా నిలుస్తున్నారని ప్రజా సమస్యలపై నిరసన తెలియజేయడానికి వచ్చిన సిఐటియు మహిళా నాయకురాలుని మహిళ అని కూడా చూడకుండా లాగి అరెస్టు చేయడం చూసిన ప్రజలు పోలీసులంటే రక్షకులా.. బక్షకులా.. అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయడానికి వచ్చిన నాయకుల పై అది కూడా ఒక మహిళపై ఇంతటి దౌర్జన్యానికి పాల్పడుతారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై నిరసన చేసి ప్రభుత్వానికి తెలియజేయాలనుకున్నప్పుడు మీరు అరెస్టు చేశారు కాబట్టి సిఐటియు నాయకులు సీఐ బాబి కి ఆ రోడ్డు సమస్యపై వినతి పత్రం అందజేసి మీరే ఈ సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య, శాంతమ్మ, సిఐటియు అధ్యక్షులు మహేష్ బాబు, సతీష్, ఆవాజ్ కమిటీ నాయకులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాలేజీలో సమస్యలు పరిష్కరించండి



ప్రిన్సిపల్కు సిఐటియు నాయకుల వినతిపత్రం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట గుర్రప్ప శెట్టి కాలెజీ మహిళా విద్యార్థుల అనేక సమస్యలతో బాధపడుతున్నారని తెలుసుకున్న సిఐటియు నాయకులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కాలెజీ ప్రిన్సిపల్కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ మాట్లాడుతూ కాలేజీ ఒక దగ్గర హాస్టల్ ఒక దగ్గర ఉన్నాయని హాస్టల్ నుంచి కాలేజీకి దాదాపుగా రెండు కిలోమీటర్ల దూరం ఉందని, ఆడపిల్లలకు రక్షణ ప్రశ్నార్థంగా ఉందని తెలిపారు. హాస్టల్ నుంచి కాలేజీకి రావాలంటే రైల్వే అండర్ బ్రిడ్జిని ఉపయోగించవలసి వస్తుందని అలాంటి సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు కాలెజీ స్థలంలో హాస్టల్ కట్టి, పిల్లలకు వసతి ఏర్పాటు చేయాలని కోరారు. కాలేజీలో కూడా బాత్ రూములు శుభ్రంగా లేవని ఆరోపించారు. పిల్లలే శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. స్వీపర్లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిల్ను కోరగా, కనీసం అటెండర్ను కూడా ఏర్పాటు చేయలేమని ఆయన చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటు మహిళా సంఘం, సిఐటియు ప్రజా సంఘాలతో పోరాటం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శివకవి ముకుందా, ఆటో యూనియన్ జిల్లా నాయకులు సతీష్, పరిశ్రమల నాయకులు ఎస్.కె అబ్దుల్లా, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి విజయమ్మ, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గించడమే బాలోత్సవం లక్ష్యం : మల్లారపు నాగార్జున



మాట్లాడుతున్న తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పిల్లల్లో నేడు మారుతున్న విద్య ప్రమాణాలతో మానసిక ఒత్తిడిలు పెరిగిపోతున్నాయని, వారి మానసిక ఒత్తిడిని, డ్రాయింగ్, వారిలో దాగివున్న సృజనను వెలికి తీయడమే లక్ష్యంగా తిరుపతి బాలోత్సవం పనిచేస్తుందని తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో బాలోత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. గడిచిన మూడు సంవత్సరాలుగా విద్యార్థుల్లో ఉన్న మానసిక ఒత్తిడిని తగ్గించడానికి వివిధ రకాలైన పోటీలు నిర్వహిస్తూ వారికి రెండు రోజులు ఒక ఆటవిడుపు కార్యక్రమంగా, కొన్ని వేల మంది విద్యార్థుల మధ్య తమ ప్రతిభను చూపడానికి బాలోత్సవం వేదికగా నిలిచిందన్నారు. గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల వేదికగా తిరుపతి బాలోత్సవం నవంబర్ 1, రెండవ తేదీలలో ఘనంగా ప్రారంభం కానుందన్నారు. పిల్లల్లో ఉన్నత ఆలోచనలు, ఉన్నత స్థితికి చేరుకునే మార్గాలను అన్వేషించే, ఆలోచించే పరిజ్ఞానాన్ని బాలోత్సవం కలిగిస్తుందన్నారు. 35 అంశాలు, 77 విభాగాలుగా [illegible] లాలతో కలిపి 181 పాఠశాలలు, దాదాపుగా పదివేల మంది విద్యార్థులు తిరుపతి బాలోత్సవంలో పాల్గొనడానికి ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఎల్కేజీ నుండి పదవ తరగతి విద్యార్థులు ఈ బాలోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తిరుపతి నగర ప్రజలు కూడా ఈ బాలోత్సవంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ చాలావరకు పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి మార్గాలు లేకుండా పోతున్నాయన్నారు. ఏడాదిలో రెండు రోజులపాటు వేలాది మంది పిల్లలతో నిర్వహించే బాలోత్సవం కచ్చితంగా పిల్లల్లో పోటీ తత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. దాదాపు 200 మంది న్యాయ నిర్ణీతలుగా ఉంటారని, వీరందరూ ఎక్కడా విమర్శలకు తావు లేకుండా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లను నిర్వహణ కోసం పనిచేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై తిరుపతి బాలోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి నిఘా ముఖ్య భద్రతాధికారి మురళీకృష్ణ, ఎంతోమంది కవులు, రచయితలు, సాహితీ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఎక్కడా చూడని కళా ప్రదర్శనలు తిరుపతి బాలోత్సవంలో ప్రదర్శింపబడతాయన్నారు. తిరుపతి బాలోత్సవం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యదర్శి పయ్యావుల గురునాథం, కార్యవర్గ సభ్యులు మణికంఠ, నెల్లూరు మునిలక్ష్మి పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: నేటి అధునాతన సాంకేతిక సమాజంలో విద్యుత్ ప్రాధాన్యం వెలకట్టలేం. గృహంలోనో, కార్యాలయంలోనే కేవలం 5 నిమిషాలపాటు విద్యుత్ సరఫరా ఆగినా సగటు మనిషిగా ఎంతగానో ఇబ్బందిపడతాం. కరెంటు సరఫరా ఆగితే ప్రపంచమే మూగబోయిందనే చందంగా కరెంటు ఎప్పుడొస్తుందా అనిఎదురుచూస్తాం. నేటి సమాజంలో విద్యుత్తుకు అంతటి ప్రాధాన్యం వుంది మరి. అలాంటి విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులు, సిబ్బంది విద్యుత్తు వినియోగదారులకు సత్వర సేవలందించి, నాణ్యమైన నింతరాయ విద్యుత్తును సరఫరా చేయడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఎదురైన హుద్ హుద్ తుఫాను విద్యుత్ శాఖకు ఎన్నో పాఠాలను నేర్పింది. ఆ అనుభవంతోనే నేడు మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యుత్తు ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్ళు పనిచేస్తూ అతితక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తూ వినియోగదారుల మన్ననలు పొందడం వారి పనితీరును ప్రతిబింబిస్తోంది.




అధికారులతో సమీక్షిస్తున్న సిఎండి శివశంకర్ లోతేటి

మొంథా తుఫాను కారణంగా విద్యుత్తు వ్యవస్థ కొంతమేరకు దెబ్బతింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అండ్ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ల ఆదేశాలు, సూచనల మేరకు రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిలు శివశంకర్ లోతేటి, ఐ.ఎ.ఎస్., పృథ్వీతేజ్ ఇమ్మడి, ఐ.ఎ.ఎస్., పి.పుల్లారెడ్డిలు ముందు జాగ్రత్తలపై తక్షణ చర్యలు తీసుకున్నారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి, ఐ.ఎ.ఎస్., నిత్యం వీడియో కాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్స్లను నిర్వహిస్తూ, అధికారులు, సిబ్బందికి ముందస్తు జాగ్రత్తలు, సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. తద్వారా తుఫాను నష్టాన్ని కొంతమేరకు తగ్గించేందుకు అవకాశం ఏర్పడింది. తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో తక్కువ సమయంలోనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ తుఫాను కారణంగా ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువగా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లగా వైఎస్ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో ప్రభావం తక్కువగా వుంది.

ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుఫాను కారణంగా 33కెవి సబ్-స్టేషన్ల బ్రేక్-డౌన్, విద్యుత్తు స్తంభాలు, లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతినడంతో 6 పట్టణాలు, 11 మండలాలు, 148 గ్రామాల్లో 10,982 విద్యుత్ కనెక్షన్లు, 4,337 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్దరణ కోసం సంస్థ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి, ఐ.ఎ.ఎస్., ఆదేశాలు, సలహాలతో అతితక్కువ సమయంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాయి.

మొంథా తుఫాను ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వ్యవస్థకు భారీగా వాటిల్లింది. వాతావారణ కేంద్రం ముందస్తు అంచనాల మేరకు తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా తిరుపతి కేంద్రంగా వున్న ఎపిఎస్పిడిసిఎల్, విజయవాడ కేంద్రంగా వున్న ఎపిసిపిడిసిఎల్, విశాఖపట్నం కేంద్రంగా వున్న ఎపిఇ పిడిసఎల్ సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్టాలను కొంత మేరకు తగ్గించేందుకు





అవకాశం ఏర్పడింది. ఎపి ఇపిడిసిఎల్ పరిధిలో తుఫాను ప్రభావం ఎక్కువగా వుంటుందని అంచనా వేసి, అందుకు అనుగుణంగా ఎపి ఎస్పి డిసిఎల్ నుంచి డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ ఆర్ డి) కె. గురవయ్య నేతృత్వంలో ఉద్యోగులు, సిబ్బందితో కూడిన బృందాలు ఎపిఇపిడిసిఎల్కు చేరుకున్నాయి. విద్యుత్ పరికరాలను కూడా ఎపిఇపిడిసిఎల్కు తరలించారు. ఎపిఎస్పి డిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, ఐ.ఎ.ఎస్., సైతం విశాఖపట్నంలోని ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఐ.ఎ.ఎస్., ఇతర అధికారులు, సిబ్బందితో మమేకమై సరఫరా పునరుద్దరణ పనులను పర్యవేక్షిస్తూ, అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతో అక్కడ సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు మార్గం సుగమం అయింది.

తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలో సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు వీలుగా ఎపిఎస్పిడిసిఎల్ నుంచి 112 మంది అధికారులు, 1,393 మంది సిబ్బందితో కూడిన 124 ప్రత్యేక బృందాలు కాకినాడ, కోనసీమ, అనకా పల్లి తదితర ప్రాంతాలకు చేరుకున్నా యి. జోరుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో ఉధృతంగా వున్న నీటి ప్రవాహానికి బెదరకుండా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో విద్యుత్ సర ఫరా పునరుద్ధరణే ధ్యేయంగా పనిచే యడం సంతోషదాయకం. అదేవి ధంగా ఇపి డిసిఎల్ పరిధిలో దెబ్బతిన్న పరికరాలను మార్చేందుకు వీలుగా ఎపిఎస్పిడిసిఎల్ నుంచి సింగిల్ ఫేజ్ 16 కెవిఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు 250, ఎబి స్విచ్ మౌంటింగ్ అరేం జ్మెంట్ 250. ఎస్ఎంసి డిస్ట్రిబ్యూషన్ బాక్స్ లు 125, క్రాస్ ఆర్మ్స్ 200, 33కెవి ట్యాపింగ్ క్రాస్ ఆర్మ్స్ 200, 33కెవి టాప్ ఫిట్టింగ్స్ 1000, 100 ఎస్క్యూఎంఎం కండక్టర్ 100 కి.మీ., ఎల్ టి ఎబి కేబుల్ 3 కోర్ 100 కి.మీ., ఎల్ టి ఎబి కేబుల్ 2 కోర్ 100 కి.మీ. విద్యుత్ పరికరాలను పంపించడం జరిగింది.

జోరు వర్షాన్ని, నీటి ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా అతి తక్కువ కాలంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రేయింబవళ్ళు శ్రమించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అండ్ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ లు ప్రత్యేకంగా అభినందించడం గొప్ప విషయం.

డాక్టర్ జగదీష్‌కి అభినందనల వెల్లువ



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య సంస్థలన్నిటికీ డైరెక్టర్గా నియమిస్తూ పాలకమండలి తీర్మానించిన విషయం తెలిసిందే. సిమ్స్, బర్డ్, అశ్విని హాస్పిటల్ ఆయుర్వేద, కేంద్రీయ హాస్పిటల్స్‌కు డైరెక్టర్గా జగదీష్ పనిచేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే డాక్టర్ జగదీష్ బాధితుల స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో బర్డ్ నర్సింగ్ సూపరిడెంట్ విజయభారతి, సిబ్బంది కేకే రాజు జుదా నాయుడు, గురువారం జగదీష్ ను ఆయన చాంబర్లో కలిసి పుష్ప పిచ్చాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

మోహన్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగకు చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త పాగాల నాగమోహన్ రెడ్డి కుటుంబాన్ని గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు ఆర్కర్ రెడ్డి పరామర్శించారు. నాగమోహన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, యుగంధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్, ముని రాఘవ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారుకు మరమ్మతులు చేయరా..?



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యుత్ బోరు మోటారుకు మరమ్మతులు చేయించాలని శ్రీకాళహస్తి మండలంలోని ఈశ్వరయ్య గిరిజన కాలనీ వాసులు వేడుకుంటున్నారు. ఈ కాలనీలో సుమారు 3 వారాల కిందట విద్యుత్ బోరు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి ఈ కాలనీ వాసులు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. పక్క కాలనీలకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. మరమ్మతులు చేయాలని అధికారులను వేడుకుంటున్నా స్పందన లేదని వాపోతున్నారు. విద్యుత్ బోరుకు అనధికారికంగా కనెక్షను ఇచ్చారనీ, అలాంటప్పుడు తాము మరమ్మతులు చేయలేమని అధికారులు తిరుగుతిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, కె.బి.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని కె.బి.ఆర్.పురం, ఎస్.టి.కాలనీ వారికి ఆధార్ కార్డులు ఇవ్వాలని పుత్తూరు తహశీల్దారు కార్యాలయం వద్ద కాలనీ వాసులు గురువారం నిరసన చేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ, ఆధార్ కార్డు లేకపోతే ఎలాంటి సంక్షేమ పథకాలకు రావడం లేదని తహశీల్దారు స్పందించి తక్షణమే ఆధార్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కె.బి.ఆర్.పురం గిరిజనులు టి.కన్నెమ్మ, ఎం.ఆదెమ్మ, టి.మణి, ఎం.నడపయ్య, జి.చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ, గణపతి పురం గిరిజన కాలనీలో గురువారం పేట చిరంజీవి, పేట చంద్రశేఖర్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా డొక్కా సీతమ్మ 66వ వారం అన్నదాన కార్యక్రమం గిరిజన కాలనీలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తుఫాన్ ప్రభావానికి గురైన అనేక గిరిజన కాలనీలో నివసిస్తున్న ప్రజలకు దుస్తులు, నిత్యవసర సరుకులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గంధం శీను, కల్లిపూడి వెంకటేష్, ప్రదీప్ కుమార్, తేజ, మనీ, దినేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సీఎం రమేష్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ వ్యాపారవేత్త, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ గురువారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్ సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగేలా చూడండి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగేలా చొరవ చూపాలని సీఎం రమేష్కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శబరి, భువనేశ్వర్, కేరళ, వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగడంతో పాటు రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ను కూడా ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు.

మేస్త్రీకి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ,సుబ్బానాయుడు కండ్రిగలో లక్ష్మణ్ అనే యువకుడు మేస్త్రీ పని చేస్తుండగా జారి పడి, వెన్నుపూస విరిగి నరాలు కట్ అవ్వడంతో మంచానికి పరిమితమయ్యారు. అతనికి జై భీమ్ ద్వారా ఇంటికి కావాల్సిన నిత్యావసర సరుకులు అందించారు. అతనికి నెల నెలా కావాల్సిన సహాయం చేసి, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పెన్షన్ కూడా మంజూరయ్యేలా చూస్తామని జై భీమ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ లీగల్ అడ్వైజర్ రిటైర్డ్ టీచర్ గుజ్జప్ప, రిటైర్డ్ పోస్ట్ ఆఫీసర్ వెంకటరామయ్య, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ పరంథామన్, ఫౌండేషన్ సెక్రటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రజ్ఞశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పుదుచ్చేరిలో జరిగిన జాతీయస్థాయి సెకండ్ డ్రీమ్ ఓపెన్ కరాటే పోటీల్లో స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న ఎన్.ప్రజ్ఞశ్రీ ప్రతిభ చాటింది. జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని చేజిక్కించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి గురువారం విద్యార్థినిని అభినందించారు. ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యంబియులో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - చంద్రగిరి : మోహన్ బాబు విశ్వవిద్యాలయం విద్యార్థులకు మరో గర్వకారణమైన విజయాన్ని అందించింది. మొత్తం 253 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4 లక్షల నుండి రూ.6.75 లక్షల వరకు ప్యాకేజీ లభించింది. ఈ విషయాన్ని కెరీర్ డెవలప్మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డా. కె. ఢిల్లీబాబు ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులను వర్సిటీ చాన్సలర్ మోహన్ బాబు, ప్రో-చాన్సలర్ విష్ణు వర్ధన్ బాబు తదితరులు అభినందించారు.

మేక్ ఏథాన్ వర్క్ షాప్లో సిద్దార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మదనపల్లెలో జరిగిన రెండు రోజుల మేక్ ఏ థాన్ వర్క్షాప్, కంపిటీషన్లో పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బైటాన్, ఇన్నోవేట్ సంయుక్త ఆధ్వర్యంలో మిట్స్ మదనపల్లెలో నిర్వహించిన మేక్ ఫర్ మదనపల్లి కార్యక్రమంలో సిఎస్ఈ విభాగానికి చెందిన విద్యార్థులు కుమార్, మాధురి, ఉదయ్ కిరణ్ రెడ్డి, ఆదిల్ కలిసి రూపొందించిన "క్లైక్ -కెన్" అనే వినూత్న ప్రాజెక్ట్ ద్వితీయ బహుమతిని సాధించింది. న్యాయ నిర్ణేతలు ప్రాజెక్టును ప్రశంసించి రూ.7,000 నగదు బహుమతి అందజేశారు.

సమస్యల కొలువు.. దళితుల నెలవు

పెట్లూరు పంచాయతీలో మౌలిక వసతులు లేక పేదల అవస్థలు, దళితులపై వివక్షత..!



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి పట్టణం నుండి పెట్లూరు పంచాయతీకి చేరుకోవడానికి రెండు వైపులా రోడ్లు ఉన్నాయి. మొదటిది వెంకటగిరి టౌన్ నుండి రైల్వే గేటు మీదుగా మోడల్ స్కూలు వెనకాల వైపు నుండి పెట్లూరు గ్రామానికి చేరుకుంటుంది. రెండవ రోడ్డు వెంకటగిరి పట్టణం నుండి రైల్వే గేటు మీదుగా నాయుడుపేట రూట్లో మోడల్ స్కూలు దాటిన తర్వాత సీతారాం ఏచూరి నగర్ అనంతరం పెట్లూరు ఆర్చి దగ్గర నుండి క్రాస్ ఐ పెట్లూరు పంచాయతీకి చేరుకుంటుంది.

అధ్వానంగా ఉన్న రోడ్లు



నీరు పోయెదెట్టా..

పెట్లూరు గ్రామానికి చేరుకోవడానికి రెండు వైపులా రోడ్లు ఉన్నాయి. ఈ రెండు రోడ్లు కూడా అస్తవ్యస్తంగా గుంటల మయంగా ఉన్నాయి. ఈ రోడ్లమీద ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కారులు తదితర వాహనాల్లో వృద్ధులు గర్భవతులు మహిళలు పిల్లలు ప్రయాణాలు చేయాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలేమో గ్రామాలకి రోడ్లు వేస్తున్నాం.. అభివృద్ధి చేస్తున్నామంటూ డప్పు కొడుతున్నాయి. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. నాయకులు ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి సహకరించాలని ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు.

దళితవాడ శ్మశానానికి రోడ్డు లేక అవస్థలు

పెట్లూరు పంచాయతీ, దళితవాడ అరుంధతిలకు స్మశానానికి సరైన దారి లేదు. ఎవరైనా మరణిస్తే



బురద మయం

స్మశానానికి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని, స్మశానానికి వెడల్పైన దారి సౌకర్యం కల్పించి, రోడ్డు వేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం దళితుల స్మశానానికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని కోరుతున్నారు.

వాటర్ ట్యాంక్ కట్టారు.. నీళ్లు వదలడం లేదు

2022-23 సంవత్సరంలో(సుమారుగా) నాలుగు వేల లీటర్ల కెపాసిటీ కలిగిన వాటర్ ట్యాంక్ను దళితవాడ(అరుంధతీయులు) కోసం కట్టారు. కానీ ఇప్పటి వరకు ఆ వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు మాత్రం వదలలేదు. దళితులంటే ఇంత చులకనా.. ఇంత వివక్ష చూపుతారా అంటూ స్థానికులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు సప్లై చేయాలని కోరుతున్నారు.

నివాసాలు ఖాళీ చేసి వెళ్లండంటూ బెదిరింపులు

పెట్లూరు పంచాయతీ పరిధి సర్వేనెంబర్ 121 లో ఉన్న ప్రభుత్వ భూమిలో రెండు సంవత్సరముల నుండి గ్రామ దళితులు, గిరిజనులు ఇతర వెనుకబడిన సామాజిక తరగతుల వారు ఇళ్ల నిర్మించుకొని నివాసాలు ఉంటున్నారు. ఇది



దిష్టి బొమ్మలా వాటర్ ట్యాంక్



గోతుల రోడ్లు

ఓర్వలేని స్థానిక టిడిపి నాయకులు మీరంతా మమ్మల్ని అతిక్రమించి ఎర్రజెండా ద్వారా ఇళ్ల వేశారని, ఇక్కడినుండి వెంటనే వెళ్ళండని బెదిరిస్తున్నారు. ఖాళీ చేసి వెళ్ళండి లేదంటే కేసులు పెడతా మని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికా రులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయా లని కాలనీ వాసులు కోరుతున్నారు.

సైడ్ కాలువలు లేవు

ఉన్న అరకొర సిమెంటు రోడ్లకు సైడ్ కాలవలు లేవు. మురికి నీరు, వర్షం నీరు పోవడానికి వీలు లేకుండా ఉంది. సైడ్ కాలవలు ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

సర్వే నెంబర్ 12 -1లో సుమారు 420 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూముల్లో దళిత గిరిజనులు సాగు చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు కేసులు పెడతామని బెదిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు గిరిజనులమైన భూమిలేని నిరుపేదలైన తమకు కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం : ఎమ్మెల్యే కోనేటి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా మండలంలోని పంచాయితీలకు రూ.20 లక్షలు చొప్పున మంజూరైన నిధులు, చేపట్టదలచిన పనులు వివరాలను ఎంపీడీఓ మహమ్మద్ రఫీ ద్వారా ఆరా తీశారు. ప్రస్తుతం నిధులు విడుదలైన వేలూరు, నీరువాయి పంచాయతీలలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల స్మశానాలలో నిర్మించిన, నిర్మించనున్న బోర్ల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్బి పేటలో పేదలకు అందించనున్న భూమి పట్టా జాబితాపై తహశీల్దారు వివరించారు. మండలంలోని ఇల్లు లేని లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని తహశీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు. వర్షాల నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, ఆయకట్టు చైర్మన్ రవి, యస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అస్మదీయులకే టీటీడీ బోర్డు కాంట్రాక్టులా..?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కాణిపాకంలో ఇప్పటికే యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం వినాయక సదన్, గణేష్ సదన్ అనే రెండు వసతి సముదాయాలు ఉన్నాయని, కొత్తగా టీటీడీ బోర్డు కాణిపాకంలో అతిథి గృహ, వసతి సముదాయాలను నిర్మించడానికి 25 కోట్ల రూపాయలు కేటాయించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాణిపాకంలో ఉన్న రెండు వసతిగృహాలు పూర్తిగా నిండిన దాఖలాలు ఇప్పటికీ లేవని, అస్మదీయులకు టిటిడి కాంట్రాక్టులను కట్టబెట్టడానికి టిటిడి బోర్డు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం, భక్తుల సొమ్మును దారి మళ్లించడం మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంలో మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డిని ఎందుకు విచారణ పరిధిలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. తిరుమలలో అఖిలాండం వద్ద అక్రమంగా దీపాల విక్రయం చేస్తున్నారన్నారు. తిరుమలలో జరుగుతున్న అవినీతిపై టిటిడి చర్యలు తీసుకోకపోతే, సోమవారం టిటిడి పరిపాలన భవనం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ బాధ్యులు ఐదాల లోకేష్ రెడ్డి, చిత్తూరు శివశంకర్, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకులు చిత్తూరు శివశంకర్, జ్యోతిశ్వర్ నాయక్, పార్థసారథి రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శంకర్ నాయక్ స్థాయి మరిచి మాట్లాడారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ తన స్థాయిని మరిచిపోయి ఇష్టానుసారం సీఎంను తన కులాన్ని మార్చుకోవాలని అహంకారపూరితంగా మాట్లాడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకట్రమణ నాయక్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి సంఘం నాయకుడిగా ఎంతో మందిని దోచుకొని ఎదిగిన శంకర్ నాయక్, సీఎంను ఇష్టానుసారం మాట్లాడడం తగదన్నారు. తాను ఎస్టీ కమిషన్ సభ్యుడుగా ఉండి గత ప్రభుత్వ హయంలో దళిత యువకులపై దాడులు జరిగినా, హత్యలు జరిగినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ చంద్రగిరి నాయకులు సుధాకర్ నాయక్, రామకృష్ణ నాయక్, వెంకటకృష్ణయ్య, సుమన్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి స్టడీ క్లాసలను ఎంఈఓ2 ముని సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. పెళ్లూరు పంచాయతీ, వై సి కాలనీ పాఠశాలలో, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అనుకూల వాతావరణం ఉందో లేదో తెలుసుకున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

సైనిక్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : 2026-27 విద్యా సంవత్సరానికి సైనిక్ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించబడే ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల సమర్పణ గడువును 9 నవంబర్ 2025 వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ యన్. విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 86888 88802 లేదా 93999 76999 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

జగపతిరామయ్యకు అటానమిస్ట్ అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య డాక్టర్ విఆర్ బాంబకర్ ప్రతిష్టాత్మకమైన అటానమిస్ట్ అవార్డు లభించింది. జబల్పూర్లో 39వ జాతీయ అకానమీ 2025 సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య నానాజా దేశ్ ముఖ్ వెటర్నరీ సైన్సు వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఇండియన్ మొదట జనరల్ ఆఫ్ వెటర్నరీ అనాటమీ జనరల్కు ప్రధాన సంపాదికుడుగా ఎంపికయ్యారు. ఈ పదవిలో 3 సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.

తుపాన్ సహాయక చర్యలు

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా ఆర్ అండ్ బీ అధికారులు ముక్కోటి వద్ద, స్వర్ణముఖి నది వంతెన వద్ద సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలకు స్వర్ణముఖినది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో చెత్తా చెదారం వంతెన వద్ద నిలిచిపోవడంతో సంబంధిత ఆర్అండ్ బీ డీఈఈ శ్రీనివాసులు, ఏఈఈ అజిత్ కుమార్ ఆధ్వర్యంలో ముళ్ళ కంపలను, చెత్తా చెదారాన్ని తొలగించారు.

విజిలెన్స్ అవేర్నెస్ వీక్ వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పుత్తూరులో విజిలెన్స్ అవేర్నెస్ వీక్-2025 లో భాగంగా "విజిలెన్స్: అవర్ షేర్డ్ రెస్పాన్స్‌బిలిటీ"అనే థీమ్‌పై విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాంటీ కరప్షన్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.వి. నరసింహరావు విచ్చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: రక్తదాన శిబిరం విజయవంతమయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ధన్యవాదాలు తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా గురువారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 300 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మేనకూరు పరిశ్రమలలోని వివిధ కంపెనీల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతర సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలను పురస్కరించుకుని నాయుడుపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, నాయుడుపేట ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం అమరావతి సర్కిల్ నుంచి సిఎస్ తేజ వరకు.. తిరిగి సీఎస్ తేజ నుంచి అమరావతి సర్కిల్ వరకు టూ కే రన్ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పోలీసులు, పలువురు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు రెండవ పట్టణ సీఐ శ్రీనివాస్, ఒకటో పట్టణ సీఐ శేఖర్ బాబు, గూడూరు రూరల్ ఎస్సై తిరుపతయ్య, రెండో పట్టణ ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వికాస్ జూనియర్ కాలేజ్ని సందర్శించన ఎంఈఓ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వికాస్ జూనియర్ కళాశాలను గురువారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి మునుసుబ్రమణ్యం సందర్శించారు. కళాశాలలోని టాయిలెట్లను పరిశీలించి బాల, బాలికలకు ప్రత్యేకమైన సదుపాయాలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేచారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు శ్రద్ధగా చదువుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వికాస్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఉగుమూడి మనోహర్, ప్రిన్సిపల్ కత్తి హేమచంద్ర, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ పిగిలం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటును తెరవండి



రైల్వే ట్రాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్.ఎస్.ఆర్ కాలనీ వాసులు

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేటలోని ఎన్.ఎస్.ఆర్ కాలనీ రైల్వే గేటు సమస్యపై సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి ఆధ్వర్యంలో రెవెన్యూ, రైల్వే, మున్సిపల్ అధికారులు జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని గురువారం కాలనీ వాసులతో నిర్వహించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ సుమారు 500 కుటుంబాలకు పైగా ఎన్.ఎస్.ఆర్ కాలనీలో పెద్దల కాలం నుండి 78వ రైల్వే గేట్ ద్వారానే రాకపోకలు సాగిస్తూ ఉండేవారమని, అయితే ఎటువంటి సమాచారం లేకుండా రైల్వే గేట్ మూసివేసి, సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న విన్నమాల రోడ్డును ఉపయోగించుకోవాలంటూ ఇబ్బందులు గురిచేస్తున్నారని, ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే గేటును మూడు నెలలుగా మూసివేసి, అటువైపు వెళ్లేందుకు వీలు లేకుండా కంకర రాళ్లు,పెద్ద పెద్ద బండలను రహదారిపై అడ్డుగా వేసి రాకపోకలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి గాని, పాత గేటు ద్వారానే రాక పోకలు గానీ పునరుద్ధరించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గతంలో రెవెన్యూ, రైల్వే అధికారులు గ్రామ సభ జరిపారని చెప్పడంతో గ్రామస్తులు ఒక్కసారిగా అడ్డుకున్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని రెవెన్యూ రైల్వే అధికారులు బడా బాబులతో కుమ్మక్కై విన్నమాల వద్ద నుంచి రహదారి ఏర్పాటు చేసి రైల్వే గేటును మూయించేశారని తెలిపారు. దీంతో ఆర్డీవో సమస్యను ఉన్నతాధికారులకు నివేదికిస్తామని వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులల్లా, రైల్వే పిడబ్ల్యుడి నజీర్, ఎస్ఐ ఆదిలక్ష్మి,రైల్వే పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిని రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వెంకటగిరి వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న జిల్లాల, మండలాల పునర్వ్యవస్థీకరణ శాస్త్రీయంగా జరగటంలేదని, ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ జరిగినట్లు తన దృష్టికి రాలేదన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతున్నారని, గూడూరు డివిజన్లో ఉన్న వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలను శ్రీకాళహస్తి డివిజన్లో విలీనం చేస్తారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో వెంకటగిరిని ప్రత్యేక రెవెన్యూ డివిజన్గా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకొని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయిస్తే వెంకటగిరి అభివృద్ధికి సహకరించిన వారవుతారన్నారు. వెంకటగిరి రెవెన్యూ డివిజన్గా చేయడం వల్ల పాలనా సౌలభ్యం, ఈ ప్రాంత ప్రజల ప్రజాభీష్టం నెరవేర్చిన వారవుతారని, దీనిని గౌరవించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధి చొరవ చూపాలన్నారు.

క్రైం న్యూస్

శంఖంపల్లిలో పట్ట పగలే చోరీ

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, శంఖం పల్లిలో తాళాలు వేసిఉన్న ఇటిలో గురువారం మధ్యాహ్నం పదితులాల బంగారు చోరీ అయినట్లు ఫిర్యాదు అందిందని పాకాల పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు శంఖంపల్లి గ్రామానికి చెందిన వసంతమ్మ తిరుపతికి ఆసుపత్రిలో చూపించుకు రావడానికి వెళ్లింది. మధ్యాహ్నం వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి కిటికీ కమ్ములను కోసి, బీరువా పగులగొట్టి ఎనిమిది లక్షలు విలువ చేసే బంగారు నగలను దోచుకెళ్లారని తెలిపారు. బాధితురాలు వసంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపాట్టారు.

ఏకలవ్య పాఠశాలలో సైన్స్ ఫెయిర్



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టును పాఠశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య, సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాదులు అతిథులుగా హాజరయ్యారు. సిఐ, యంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గిరిజన కుటుంబాలకు ఆహార పొట్లాలు పంపిణీ



ప్రజాశక్తి - చిల్లకూరు : తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం, ఓడూరులో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పారిశ్రామికవేత్త, మాజీ పెంచలకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీ సూచనల మేరకు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి సూచనల ఆధ్వర్యంలో తుపాను కారణంగా పునరావస కేంద్రాల్లో నివాసమున్న 70 గిరిజన కుటుంబాలకు ఏపీ లైవ్ స్టాక్ డైరెక్టర్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి ఆహార పొట్లాలు అందజేశారు.

అట్రాసిటీ కేసుపై డిఎస్పి విచారణ

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాలాయపల్లి మండలం, యాచవరం గ్రామానికి చెందిన వరికూటి అన్నపూర్ణ స్వాధీనంలో ఉన్న భూమిని యాచవరం గ్రామానికి చెందిన సీసీ నాయుడు ఆక్రమిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించాడనే ఫిర్యాదు మేరకు బాలాపల్లి పోలీసులు అట్రాసిటి కేసు నమోదు చేశారు. వివాదాస్పదంగా మారిన అక్క సముద్రం రెవెన్యూ పరిధిలోని భూములను గూడూరు డిఎస్పి గీతా కుమారి గురువారం పరిశీలించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపి తదితరులు ఉన్నారు.

వర్షాల నేపథ్యంలో వరి పంట కాపాడుకునే విధానాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి రైతులు వరి పంటలను కాపాడుకోవాలని డాక్టర్ సుమతి కోరారు. గురువారం వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారిణి నడవలూరు, మిట్టూరు గ్రామాలలో దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు. కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదని సూచించారు. కుప్పలు వేసేప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లి కుప్పవేసుకుంటే నష్టాన్ని నివారించవచ్చన్నారు. వరి కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలని తెలిపారు. పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలన్నారు. ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టాలన్నారు. రైతులు పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లను 8331057819, 986602175 5 సంప్రదించి సలహాలు తీసుకోవాలని కోరారు.

యువత విలువలు పాటించాలి : ఎస్వీయు విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : యువత పారదర్శకత, బాధ్యత, నిజాయితీ వంటి విలువలను ఆచరించాలని వర్సిటీ ఉపకులపతి ఆచార్య నరసింగరావు పేర్కొన్నారు. ద న్యూ ఇండియా అషుఽరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వర్సిటీ సెనెట్ హాల్లో గురువారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ద న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ బిజినెస్ మేనేజర్ పీఎస్ లత, డిప్యూటీ మేనేజర్ సాయి గురుగోవింద్, అసిస్టెంట్ మేనేజర్లు నంద స్వరూపరెడ్డి, సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్లో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - నాగలాపురం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. గురువారం నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (మహిళా యూనివర్సిటీ), హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సమన్వయంతో నాలుగు రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం హెచ్ఈడబ్ల్యుఎస్ ఇనిషియేటివ్ లో భాగంగా విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం, ప్లేస్మెంట్ అవకాశాలకు వారిని సిద్ధం చేయడం లక్ష్యంగా ఉంచుకుంది. ప్రతిరోజూ ఐదు గంటలపాటు శిక్షణా సెషన్లు నిర్వహించబడతాయి. శిక్షణా కార్యక్రమం సావేరి సెమినార్ హాల్, లా డిపార్ట్మెంట్, ఎంసిఎ డిజిటల్ క్లాస్‌రూమ్, ధృతి హాల్ వంటి ప్రాంగణాల్లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ ప్రారంభించగా, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుధా నిర్వహించారు.

విద్యార్థుల ప్రత్యేక ఆధార్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల కేంద్రంలోని ఎస్ఏఎల్ సి ఈ ఎఫ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక ఆధార్ సెంటర్ను తాసిల్దార్ సయ్యద్ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నసీంఆలీ, ఆనంద్లు, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయులో ఉన్నత పదవుల భర్తీలో సామాజిక న్యాయం పాటించాలని ఎపి బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్పూరు నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న రిజిస్ట్రార్, రెక్టార్ పదవులలో సీనియర్ బిసి ఆచార్యులను నియమించాలని, మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తికి వినతి ఇచ్చారు.